# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 14-11-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ఐదు బిల్లులు రాష్ట్ర ప్రభుత్వం ఈరోజు ప్రవేశపెట్టనుంది.**
2. **రాష్ట్రంలో గత ప్రభుత్వం చేపట్టిన అసైన్‌మెంటు భూముల బదలాయింపులపై పునః పరిశీలన చేస్తున్నామని రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడించారు.**
3. **రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు.**
4. **రాష్ట్రవ్యాప్తంగా న్యాయ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఏపీలాసెట్ రెండో విడత కౌన్సెలింగ్ ఈ రోజు నుంచి ప్రారంభమైంది.**
5. **ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా వివిధ ప్రాంతాల నుంచి శబరిమలకు 26 ప్రత్యేక రైళ్ళు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది.**

==========================

రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాలు మూడో రోజు ప్రారంభమయ్యాయి. ప్రశ్నోత్తరాల సమయం కొనసాగుతోంది. శాసన సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రులు సమాధానమిస్తున్నారు. సభకు విరామం ప్రకటించిన అనంతరం ప్రభుత్వం సభలో ఐదు బిల్లులు ప్రవేశపెట్టనుంది. ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ గ్రాబింగ్ ప్రోహిబిషన్ బిల్లు - 2024, ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రసిటీ డ్యూటీ బిల్లు - 2024, ఆంధ్ర ప్రదేశ్ మెడికల్ ప్రాక్టిషనర్ రిజిస్ట్రేషన్ బిల్లు - 2024., ఆంధ్రప్రదేశ్ ఆయుర్వేదిక్, హోమియోపతి మెడికల్ ప్రాక్టిషనర్స్ బిల్లు - 2024లతో పాటు డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయ చట్ట సవరణ బిల్లు - 2024 తదితర బిల్లులను ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. అనంతరం బడ్జెట్‌పై చర్చ జరుగుతుంది. మరోవైపు రాష్ట్ర శాసన సభ ఉప సభాపతిగా ఉండి శాసన సభ్యులు కె. రఘు రామ కృష్ణంరాజు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు శాసన సభాపతి సి. హెచ్ అయ్యన్న పాత్రుడు ప్రకటించారు.

--------------------------

రాష్ట్రంలో గత ప్రభుత్వం చేపట్టిన అసైన్‌మెంటు భూముల బదలాయింపులపై పునః పరిశీలన చేపడుతున్నామని రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా అసైన్‌మెంటు భూముల బదలాయింపులపై శాసనసభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ..

వాయిస్ ... 30 సెకన్లు

--------------------------

రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని ఈరోజు ఉదయం మంత్రి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ

వాయిస్.. 30 సెకన్లు

ఇది ఇలా ఉండగా.. ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఈ ఉదయం తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

---------------------------

రాష్ట్రవ్యాప్తంగా న్యాయ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఏపీలాసెట్ రెండో విడత కౌన్సెలింగ్‌ను ఈ రోజు నుంచి ఈ నెల 17వ తేదీ వరకు నిర్వహిస్తామని సెట్ కన్వీనర్ ఆచార్య సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. రేపటి నుంచి 19 వరకు అభ్యర్థుల విద్యార్హత పత్రాల పరిశీలన, 20 నుంచి 23వ తేదీ వరకు వెబ్ ఐచ్ఛికాలు, 24న మార్పులు, 26న ప్రవేశాలు పొందినవారి జాబితాను ప్రకటిస్తామని చెప్పారు. ప్రవేశాలు పొందిన అభ్యర్థులు ఈ నెల 29వ తేదీ లోపు కళాశాలల్లో చేరాలని తెలిపారు.

---------------------------

శబరిమలకు వెళ్ళే అయ్యప్ప యాత్రికుల అదనపు రద్దీని నియంత్రించేందుకు వివిధ ప్రాంతాల నుంచి 26 శబరిమల ప్రత్యేక రైళ్లను నడపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ఈ రైళ్లు ఈ నెల 17 నుంచి 25 వరకు వివిధ తేదీల్లో నడుపుతామని పేర్కొంది. ఈ రైళ్ళు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని సికింద్రాబాద్, కాచీగూడ, గుంటూరు, ఒంగోలు వంటి ప్రధాన స్టేషన్లలో ఆగుతాయని, భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని దక్షిణమధ్య రైల్వే ముఖ్య పౌర సంబంధాల అధికారి ఏ.శ్రీధర్ కోరారు.

---------------------------

వేదవతి, గుండ్రేవుల నీటి ప్రాజెక్టులను పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా కర్నూలు జిల్లా ఇరిగేషన్ ప్రాజెక్టులపై శాసనమండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ..

వాయిస్ ..25 సెకన్లు

---------------------------

బాలల దినోత్సవం సందర్భంగా బాపట్లలో మహిళాభివృది, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈరోజు ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీని జిల్లా కలెక్టర్ వెంకట మురళి ప్రారంభించారు.. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి బాలలే రేపటి భావి భారత పౌరులని అన్నారు. చిన్నారుల క్రమశిక్షణతో నడుచుకునేలా పెంచవలసిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని జిల్లా కలెక్టర్ తెలుపుతూ,

వాయిస్ ...25 సెకన్లు

---------------------------

ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో జాతీయ, రాష్ట్ర రహదారులు, రైల్వేకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నంటున్నామని ఏలూరు పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. ఏలూరులోని క్యాంపు కార్యాలయంలో ఈ రోజు ఆయన ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను

స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. నూజివీడు ట్రిపుల్ ఐటీ కళాశాలలో ప్రయోగశాలకు అవసరమైన పరికరాలు సమకూర్చేందుకు కార్పొరేట్ సామాజిక బాధ్యత-సి.ఎస్.ఆర్ నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామని తెలిపారు. ఏలూరు పార్లమెంట్ పరిధిలో ఆహార ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని మహేష్ కుమార్ వివరించారు.

---------------------------

ప్రపంచ మధుమేహ వ్యాధి అవగాహనా దినోత్సవాన్ని ఈ రోజు నిర్వహిస్తున్నారు. మధుమేహ వ్యాధి నియంత్రణకు దోహదం చేసే ఇన్సులిన్ కనుగొన్న సర్ ఫ్రెడరిక్ గ్రాంట్ బాంటింగ్ జయంతిని మధుమేహ వ్యాధి అవగాహనా దినోత్సవంగా జరుపుకుంటున్నారు. మానవ రక్తంలో అధిక మోతాదులో చక్కెర నేరుగా కలవడం వల్ల రోగ నిరోధక వ్యవస్థ పై ప్రతికూల ప్రభావం చూపి ప్రాణాలకే ముప్పుగా పరిణిమిస్తుంది. దీనినే మధుమేహం అంటారు. ప్రతిరోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, ఆహార నియమాలు పాటించడం ద్వారా మధుమేహ వ్యాధిని నియంత్రించ వచ్చునని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. మధుమేహ వ్యాధి అవగాహనా దినోత్సవం సందర్భంగా ఆకాశవాణి విశాఖపట్నం కేంద్రం రూపొందించిన ప్రత్యేక కార్యక్రమం ఈ మధ్యాహ్నం 3 గంటలకు ప్రసారమవుతుంది.

---------------------------

అనంతపురం జిల్లాలో భారతదేశ తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలను నిర్వహించారు. అనంతపురంలోని నెహ్రూ యువ కేంద్రం కార్యాలయంలో ప్రోగ్రామ్ ఇంచార్జి శ్రీనివాసులు నెహ్రు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో అన్ని కేంద్రాల్లో జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నామని చెప్పారు. అదేవిధంగా బాలల హక్కులు, రక్షణ వంటి తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎం.వెంకట్రావు కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.... 25 సెకన్లు....

=====================